మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ / సంపుటి :5 సంచిక 225 08 గురువారం, ఫిబ్రవరి 2024 పేజీలు: 4/వెల

## ఉత్తర, దక్షిణ దేశం అంటూ విభజించే కుట్రలను

# సహించేది లేదు



కొంతమంది మా రాష్ట్రం మా పన్నులు అని మాట్లాడుతున్నారు...

ఇదే వితండవాదమని ఆగ్రహం

నది మా రాష్ట్రంలో ప్రవహిస్తోంది కాబట్టి మాకే...

బొగ్గు మా వద్దనే ఉన్నది కాబట్టి మేమే వాడుకుంటామంటే ఎలా? అని ప్రశ్న

వికసిత్ భారత్ కోసం మోదీ 3.0 అవసరమన్న ప్రధాని

ఇండియా అంటే ఢిల్లీ మాత్రమే కాదు...

చెన్నై, హైదరాబాద్, బెంగళూరు కూడా అన్న మోదీ

2 లో

ఫిబ్రవరి : 07 మరో ఉదయం

## నేటి నుంచి షర్మిల జిల్లాల టూర్..

### 11న మంత్రి రోజా ఇలాకాలో బహిరంగసభ

ఈరోజు నుంచి 11వ తేదీ వరకు


షర్మిల జిల్లాల పర్యటన

ఉదయం రచ్చబండ కార్యక్రమాలు..

సాయంత్రం బహిరంగసభలు

ఈ సాయంత్రం బాపట్లలో

బహిరంగసభ



పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ షర్మిల ఏపీలో పార్టీకి జవసత్వాలు తీసుకొచ్చేందుకు తీవ్ర కృషి చేస్తున్నారు. పార్టీ సీనియర్ నేతలతో కలసి ఆమె రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేస్తున్నారు. తన ప్రసంగాల్లో అధికార వైసీపీని ఆమె ఎండగడుతున్నారు. టీడీపీపై కూడా సున్నిత విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఆమె ఈరోజు నుంచి ఈ నెల 11వ తేదీ వరకు జిల్లాల పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనల్లో భాగంగా ఉదయం రచ్చబండ కార్యక్రమాలు, సాయంత్రం బహిరంగసభలతో ఆమె ప్రజల మధ్యకు వెళ్తున్నారు.

**షర్మిల పర్యటన షెడ్యూల్:**

ఈరోజు - సాయంత్రం 5 గంటలకు బాపట్లలో బహిరంగసభ

8వ తేదీ - ఉదయం 10 గంటలకు తెనాలిలో రచ్చబండ... సాయంత్రం 5 గంటలకు ఉంగుటూరులో బహిరంగసభ

9వ తేదీ - ఉదయం 10 గంటలకు కొవ్వూరులో రచ్చబండ... సాయంత్రం 5 గంటలకు తునిలో బహిరంగసభ

10వ తేదీ - ఉదయం 10 గంటలకు నర్సీపట్నంలో రచ్చబండ... సాయంత్రం 5 గంటలకు పాడేరులో బహిరంగసభ

11వ తేదీ - సాయంత్రం 5 గంటలకు నగరిలో బహిరంగసభ. నగరిలో నిర్వహించే సభతో షర్మిల పర్యటన ముగుస్తుంది.

## దేశంలో డర్టీ పొలిటీషియన్ చంద్రబాబు

మోదీపై చంద్రబాబు ఎన్నో విమర్శలు చేశారన్న రోజా

అమిత్ షా కారుపై రాళ్లు వేయించారని విమర్శ

చంద్రబాబుతో కలవడం వల్ల బీజేపీకే నష్టమని వ్యాఖ్య



బీజేపీ పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుపై ఏపీ మంత్రి రోజా విమర్శలు గుప్పించారు. అధికారం కోసం ఎవరి కాళ్లు పట్టుకోవడానికైనా చంద్రబాబు సిద్ధపడతారని ఆమె విమర్శించారు. దేశంలోనే ఆయన డర్టీ పొలిటీషియన్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీ ముఖ్యమంత్రిగా పనికిరారని, ప్రధానిగా పనికిరారని చంద్రబాబు ఎన్నో రకాలుగా మాట్లాడారని... ఏపీకి వచ్చినప్పుడు టీడీపీ శ్రేణులు నల్ల జెండాలను ఎగరేయడాన్ని మోదీ మర్చిపోయి ఉండరనే తాను అనుకుంటున్నానని చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిరుమలకు వచ్చినప్పుడు ఆయన కారు మీద రాళ్లు వేయించిన చరిత్ర చంద్రబాబుదని రోజా అన్నారు. బీజేపీతో ఉన్నప్పుడు సొంత లాభాలను చూసుకుని... ఆ తర్వాత కాంగ్రెస్ తో చేతులు కలిపారని... ఇప్పుడు మళ్లీ బీజేపీతో కలిసేందుకు వెళ్తున్నారని విమర్శించారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకం చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. సీఎం కావడం కోసం ఎవరితోనైనా కలిసేందుకు చంద్రబాబు సిద్ధపడతారని... ఈ విషయాన్ని మోదీ గమనించాలని చెప్పారు. పురందేశ్వరితో కలిసి అమిత్ షాను నారా లోకేశ్ కలిశారని... ఆ తర్వాత చంద్రబాబుకు బెయిల్ వచ్చిందని రోజా చెప్పారు. ఇద్దరి మధ్య ఏ ఒప్పందం కుదిరిందో వాళ్లే చెప్పాలని అన్నారు. చంద్రబాబుతో కలవడం వల్ల బీజేపీకే నష్టమని చెప్పారు.

## హరీశ్ రావు మాట్లాడుతుండగా కరెంట్ కట్...

## మార్పు వచ్చిందంటూ

# సెటైర్లు



జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న హరీశ్ రావు

కరెంట్ పరిస్థితి గురించి వివరిస్తుండగా పోయిన పవర్

జనరేటర్ ఆన్ చేయడంతో ప్రసంగం ప్రారంభించిన హరీశ్ రావు

జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఈ రోజు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతుండగా కరెంట్ పోయింది. దీంతో కాంగ్రెస్ రాగానే మార్పు వచ్చిందంటూ ఆయన సెటైర్ వేశారు. ఈ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న కరెంట్ పరిస్థితి గురించి వివరించారు. హరీశ్ రావు కరెంట్ పరిస్థితి గురించి వివరిస్తున్న సమయంలోనే విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో మార్పు వచ్చిందంటూ ఆయన సెటైర్ వేశారు. దీంతో సభ నవ్వులతో నిండిపోయింది. జనరేటర్ ఆన్ చేయడంతో హరీశ్ రావు తిరిగి ప్రసంగం కొనసాగించారు.

**కేసీఆర్‌కు జనగామ అంటే అమితమైన ప్రేమ**

కేసీఆర్‌కు జనగామ అంటే అమితమైన ప్రేమ అని హరీశ్ రావు అన్నారు. ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి ప్రస్తావన తెస్తుంటారని చెప్పారు. మనకు ఉద్యమాలు, అరెస్టులు కొత్త కాదన్నారు. చంద్రబాబు, వైఎస్ హయాంలో నిర్బంధాలను చూసిన గడ్డ జనగామ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా.. మనది ఎప్పుడూ ప్రజాపక్షమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేటికి రెండు నెలలు పూర్తయిందన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తానన్న హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని... రూ.4వేల పింఛన్ ఇస్తామని ఊదరగొట్టారని.. కానీ ఉన్న రెండు వేల పెన్షన్‌ను కూడా కట్ చేశారని ఆరోపించారు.కేసీఆర్ పాలనలో రైతుబంధు ఆగిన సందర్భాలు లేవన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే రూ.15 వేలు ఇస్తామన్నారని... కానీ ఉన్న రూ.10 వేలు పోయిందని విమర్శించారు. నిరుద్యోగ భృతిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో భట్టిని నిలదీస్తే సమాధానం లేదన్నారు. రెండు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు మోసాలు చేసిందని విమర్శించారు. హామీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి ఎగవేత, దాటవేత వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వస్తే హామీలకు ఎగనామం పెట్టాలనేది కాంగ్రెస్ నేతల ప్రయత్నమన్నారు.

## తక్షణమే కులగణన చేపట్టాలి...

అప్పుడే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించవచ్చు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

ఆరు నెలల్లో కులగణన పూర్తి చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వవచ్చునని వ్యాఖ్య

అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి

పూలే విగ్రహ సాధన కోసం ఈ నెల 12న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడి

ఫిబ్రవరి : 07 మరో ఉదయం



కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే కులగణన ప్రక్రియను చేపట్టాలని భారత జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన కోసం బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పుడు ప్రారంభిస్తేనే ఆరు నెలల్లో కులగణన పూర్తి చేయవచ్చునన్నారు. అలా అయితేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చునని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 24వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అవుతారని కాంగ్రెస్ పార్టీయే చెప్పిందని గుర్తు చేశారు.స్వాతంత్రానికి ముందు చివరిసారి బీసీ కులగణన జరిగిందని... అప్పుడు 4 వేలకు పైగా బీసీ కులాలు ఉన్నాయని... ఇప్పుడు 2400 వరకు మాత్రమే ఉన్నాయని అంటున్నారని గుర్తు చేశారు. బీసీ కులాల సంఖ్యపై స్పష్టత లేకపోవడంతో అయోమయం నెలకొందన్నారు. బీసీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.20వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని... దీనిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటుకు ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని అల్టిమేటం జారీ చేశారు. పూలే విగ్రహ సాధన కోసం ఈ నెల 12న హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

2018 నుంచి ఇప్పటి వరకు 4365 మంది సివిల్స్‌కు ఎంపికైతే అందులో కేవలం 1195 మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వచ్చాయన్నారు. ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఉన్నప్పటికీ 15.5 శాతం మందిని మాత్రమే ఎంపిక చేశారన్నారు. ఎస్సీలు 5 శాతం, ఎస్టీలు 3 శాతం మాత్రమే ఎంపికయ్యారన్నారు. వెనుకబడిన వర్గాలు కోల్పోతున్న రిజర్వేషన్లపై అందరూ స్పందించాలని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు రూ.5వేల కోట్లు మాత్రమే కేటాయించడాన్ని తప్పుబట్టారు.

## అమెరికాలో తెలుగు విద్యార్థులపై దాడులు.. స్పందించిన సీఎం రేవంత్

హైదరాబాద్ :ఫిబ్రవరి : 07 మరో ఉదయం



అమెరికాలో తెలుగు విద్యార్థులపై దాడులపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సయీద్ మజ్హర్ అలీపై నలుగురు దుండగులు దాడి చేయడం తీవ్ర కలతకు గురి చేసిందన్నారు. ఇటీవలే ఓహియోలో బీ శ్రేయాష్ రెడ్డిపై కూడా దాడి చేయడంతో అతను మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇలా వరుసగా తెలుగు విద్యార్థులపై దాడులు జరగడం ఆందోళనను కలిగిస్తుందన్నారు.తెలుగు విద్యార్థుల భద్రతపై తమ ఆందోళనను అమెరికాకు తెలపాలని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. అమెరికాతో పాటు ఇతర దేశాల్లో విద్యను అభ్యసిస్తున్న తెలుగు విద్యార్థుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్కును తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎక్కడున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## విమానాశ్రయం తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

# రూపుదిద్దుకుంటోంది

రూ.750 కోట్ల నిధులతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు

మల్టీ లెవల్ పార్కింగ్, విశ్రాంతి గదులు, రూఫ్ టాప్ రైల్వే ట్రాప్ ప్లాట్ ఫామ్స్ పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడి

చర్లపల్లి టెర్మినల్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్న కేంద్రమంత్రి

ఫిబ్రవరి : 07 మరో ఉదయం



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ విమానాశ్రయం తరహాలో రూపుదిద్దుకుంటోందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. రూ.750 కోట్ల నిధులతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బుధవారం ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు.మల్టీ లెవల్ పార్కింగ్, విశ్రాంతి గదులు, రూఫ్ టాప్ రైల్వే ట్రాప్ ప్లాట్ ఫామ్స్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. తక్కువ సమయంలో వేగంగా ఈ రైల్వే స్టేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఎయిర్ పోర్ట్ తరహాలో స్టేషన్ రూపుదిద్దుకుంటుందన్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు సాగుతున్నట్లు తెలిపారు. 2025 నవంబర్ నాటికి ఈ పనులు పూర్తవుతాయన్నారు.అదే సమయంలో చర్లపల్లి టెర్మినల్ పనులు కూడా వేగంగా సాగుతున్నట్లు చెప్పారు. అది కూడా త్వరలో పూర్తవుతుందన్నారు. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామన్నారు. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే ఆ ప్రాంతాల దగ్గర కొత్త రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇక్కడ 22 లిఫ్టులు 30కి పైగా ఎస్కలేటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రయాణికులు నేరుగా స్టేషన్‌లోకి రావడానికి బయటికి వెళ్ళడానికి గగనతలం నుంచే ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందన్నారు.

మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## గత పాలకుల పాపాలను ఎండగట్టాల్సిందే !

వేసవి ప్రారంభానికి సూచికగా శివరాత్రికి ముందే సూరీడు మెల్లగా వేడెక్కుతున్నాడు. ఎండలు బాబోయ్ అనేలా సూర్యగమనం మొదలయ్యింది. ఇక ఈయేడు కూడా ఎండలు మండించనున్నాయి. ఇదే క్రమంలో ఎన్నికల వేడి కూడా అంటుకుంటోంది. ఏప్రిల్‌లో ఎండలు సుర్రుమనేనాటికి ఎన్నికల వేడి కూడా తారా స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తాజాగా తెలంగాణలో ఈ వేడి మరింత రాజుకునే అవకాశం ఉంది. ఓ వైపు పార్లమెంట్ ఎన్నికలకు ముందే తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయినప్పటికీ, ఇప్పటికే శ్వేతపత్రాలతో గత కెసిఆర్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండగట్టింది. ఇప్పుడు మరోమారు కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టుల్లో అవినీతి, ధరణి వంటి సమస్యలను ప్రస్తావించడం ద్వారా బిఆర్‌ఎస్‌ను ఎండగట్టడానికి సిద్దం అవుతోంది. ఈ క్రమంలో కృష్ణాప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడంపై ఎదురుదాడికి బిఆర్‌ఎస సిద్దం అవుతోంది. దీంతో ఈ సమావేశాలు వాడీవేడీగా సాగనున్నాయి. కెసిఆర్ అసెంబ్లీకి హాజరవుతారని అంటున్నారు. విపక్షం రేవంత్‌ను రెచ్చగొట్టి ట్రాప్‌లో పడేయాలని చూస్తుంది. అలాంటి ట్రాప్‌లో పడకుండా రేవంత్ రెడ్డి హుందాగా ఉండాలి. ఎందుకంటే రెచ్చగొట్టి రెచ్చిపోయేలా మాట్లాడించేలా చేస్తారని గుర్తించాలి. అయితే ఎన్నికల సమయంలో ఎలాంటి భాష వాడినా, ఎలాంటి విమర్శలు చేసినా చెల్లుతుంది. అధికారంలోకి వచ్చినందున సిఎం రేవంత్ రెడ్డి భాష విషయంలో సంయమనం పాటించాల్సిందే. హుందాగా ఉండాల్సిందే. మాటలను కూడా పరుషంగా వాడినా..అందులో అసభ్యత లేకుండా చూసుకోవాలి. రేవంత్ రెడ్డి రెండు నెలల పాటు సంయమనంగా ఉండగలిగారు. కానీ ఇప్పుడు ఆయన కొద్దగా మాటలతో కట్టు తప్పుతున్నారు. దారుణమైన భాషతో కేసీఆర్ పై ,బీఆర్‌ఎస్ పై విరుచుకపడుతున్నారు. ఆ భాష గతంలో కేసీఆర్ వాడిందేనని సమర్థించుకుంటున్నారు. రాజకీయాలు హుందాగా ఉండాలి. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ప్రజల ముందుంచాలి. తప్పు ఎవరిది ఒప్పు ఎవరిది అనేది.. నిజాలన్నీ ప్రజల ముందు పెడితే అర్థం చేసుకుంటారు. అందుకు అసెంబ్లీని వేదికగా చేసుకోవాలి. ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్ నిర్మాణ సభలోనూ రేవంత్ రెడ్డి మాటలు తూలారు. ప్రభుత్వాన్ని పడగొడతామని మాట్లాడున్నారని వారిని పండబెట్టి తొక్కుతామని కట్టేసికొడతామని హెచ్చరికలు జారీ చేశారు. అయితే రెచ్చగొట్టేందుకు బిఆర్‌ఎస్ సిద్దంగా ఉంది. వారి ట్రాప్‌లో పడి రెచ్చిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిఎంగా రేంవత్ రెడ్డిపై ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అనేది ఎప్పుడూ ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికే ప్రయత్నిస్తుంది. కెసిఆర్ అధికారంలో ఉండగా ప్రతిపక్షాలకు మాట్లాడనిచ్చే అవకాశం ఇవ్వలేదు. అసెంబ్లీలో ఏది మాట్లాడినా మైక్ ఇవ్వలేదు. ఇప్పుడు స్వేచ్ఛ ఇచ్చారు గనక బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చాన్స్ వస్తే వదులుకోరని అందరికీ తెలుసు. తన ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన పని సీఎం మీదనే ఉంటుంది. కానీ మాటలు జారడం వల్ల ప్రతిపక్షానికి దొరికిపోతారు. విలువల పతనం కొనసాగుతుందన్న ఆందోళన ప్రజాస్వామ్య వాదుల్లో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి స్థానానికి ఓ గౌరవం ఉంటుంది. దాన్ని కాపాడాల్సిన బాధ్యత.. ఆ సీటులో కూర్చున్న వారికే ఉంటుంది. నాడు కేసీఆర్ అలా చేశారని ఈ రోజు రేవంత్ రెడ్డి అంతకు మించి చేస్తే..రేపు వచ్చే వాళ్లు మరింత దిగజారుస్తారు. అప్పుడు పోయేది ఆయా వ్యక్తుల పరువు కాదు.. సీఎం హోదా పరువని గుర్తించుకోవాలి. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు కక్ష సాధింపులకు పాల్పడతారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన అలాంటి కక్ష సాధింపులకు ఇంకా పాల్పడలేదు. అలాంటివేమీ ఉండవని ఆయన చెప్పారు. రెండు నెలలపాటు అలాగే

పరిపాలనచేశారు. ఎందుకంటే కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ఎక్కువ. తెలంగాణలో కూడా అదే పరిస్థితి. కానీ రేవంత్ చాలా సున్నితంగా వ్యవహారాలను చక్కదిద్దుకుంటూ వెళ్తున్నారు. ఐఎఎస్,ఐపిఎస్, దిగువ స్థాయి పోలీసు అధికారుల పోస్టింగ్‌లు, పదోన్నతులు, భూముల వివాదాలు వంటి విషయంలో ఎక్కడా పార్టీ నేతల్ని కూడా నొప్పించకుండా.. అలాగని పైరవీలకు తలొగ్గకుండా పని చేసుకుంటూ పోతున్నారు. విధాన పరమైన నిర్ణయాల విషయాల్లో కూడా ఆయన తొందరపాటు ప్రదర్శించడం లేదు. పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీ జీతాలిస్తున్నారు. నిధుల అందుబాటును బట్టి రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ లౌక్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను గవర్నర్ తమిళిసై అంగీకరించేలా చేయడంలో ఆయన అంతులేని లౌక్యాన్ని ప్రదర్శించారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గతంలో తమిళిసై ప్రభుత్వ ప్రతిపాదనలు అనేకం పెండింగ్‌లో పెట్టారు. ఎంఎల్‌సిలుగా ప్రొ.కోదండరాం, అమీర్ అలీఖాన్ ఎంపిక సులభమయ్యేలా సఫలీకృతమయ్యారు. తర్వాత కోర్టు స్టేటస్ కో విధించింది. అది వేరే విషయం. కేంద్రంతో కూడా ఘర్షణ పూరిత వైఖరి కాకుండా సయోధ్యతో వ్యవహరిస్తూ మెహదీపట్నంలో ప్రధాన సమస్యగా ఉన్న స్కైవాక్ నిర్మాణానికి ప్రధాన ఆటంకంగా ఉన్న రక్షణ శాఖ భూములను అప్పగించేలా చేయడంలో విజయ వంతమయ్యారు. మెట్రో రెండో దశ విస్తరణ లోనూ ఆయన రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేయలేదు. లోక్‌సభ ఎన్నికలు జరిగే ఏప్రిల్‌లోపు, ఎన్నికల కోడ్ వచ్చేలోపు మరికొన్ని హామీలు అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీలో గత ప్రభుత్వ తప్పిదాలను కూడా ఎండగట్టాల్సిందే. అప్పుల పైనా నిలదీయాల్సిందే. అందుకు తగు విధంగా సన్నద్ధం కావాలి. విపక్షాన్ని దోషిగా నిలబెట్టాల్సిందే. తెలంగాణను అభివృద్ధి చేశామన్న ముసుగులో అప్పులు చేసిన బిఆర్‌ఎస్‌ను ప్రజలముందు దోషిగా నిలబెట్టే క్రమంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు సమిష్టిగా పోరాడాలి.

మొదటి పేజీ తరువాయి

# ఉత్తర, దక్షిణ దేశం అంటూ విభజించే కుట్రలను సహించేది లేదు

కొందరు ఉత్తర భారత్, దక్షిణ భారత్ అంటూ దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని... ఇలా దేశాన్ని విభజించే కుట్రలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సమయంలో రాజ్యసభలో ప్రధాని మాట్లాడారు. ఉత్తరాది... దక్షిణాది... మా రాష్ట్రం మా పన్నులు అంటూ వ్యాఖ్యానిస్తున్న ఆయా రాష్ట్రాల నాయకులపై మోదీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొంతమంది మా రాష్ట్రం మా పన్నులు అంటూ మాట్లాడుతున్నారని... అసలు ఇదేం వితండవాదం? అని ప్రశ్నించారు. దేశాన్ని విభజించే కుట్రలను సహించేది లేదన్నారు. వికసిత్ భారత్ కోసం మోదీ 3.0 అవసరమన్నారు. ఉత్తరాది... దక్షిణాది అంటూ నిధుల పంపిణీపై కొంతమంది నేతలు మాట్లాడటం విడ్డూరమన్నారు. కొందరు కావాలనే దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి రాష్ట్రానికి న్యాయంగా అందాల్సిన నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు. నిధుల కేటాయింపులో ఎలాంటి సంకుచితత్వం లేదని... పారదర్శకంగా ఉంటామన్నారు. రాష్ట్రాలపై ఎలాంటి వివక్ష లేదన్నారు. అన్ని ప్రాంతాలను తాము సమానంగా చూస్తామన్నారు. పేదరికం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు కాస్త ఎక్కువ నిధులు అవసరమవుతాయని గుర్తించాలని హితవు పలికారు. నది మా రాష్ట్రంలో ప్రవహిస్తోంది కాబట్టి మాకే... బొగ్గు మా వద్దనే ఉన్నది కాబట్టి మేమే వాడుకుంటాం... మా రాష్ట్రం మా పన్నులు... ఇలా మాట్లాడితే ఎలా కుదురుతుంది? అని ప్రశ్నించారు.

### ఇండియా అంటే ఢిల్లీ మాత్రమే కాదు... చెన్నై, హైదరాబాద్, బెంగళూరు కూడా

ఇండియా అంటే ఢిల్లీ ఒక్కటే కాదని ప్రధాని మోదీ అన్నారు. నా దేశం అంటే ఢిల్లీ మాత్రమే కాదు... బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ కూడా అన్నారు. దేశం అంటే మట్టి కాదని... మన ఐక్యతకు చిహ్నమని వ్యాఖ్యానించారు. ఆయా రాష్ట్రాల అభివృద్ధికి రాష్ట్రాలు ఒక్క అడుగు వేస్తే తాము రెండు అడుగులు వేసేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. కరోనా సమయంలో ప్రపంచం మొత్తం ఓడినా మనం మాత్రమే గెలిచామని గర్వంగా చెప్పారు. కరోనా సమయంలో తాను ముఖ్యమంత్రులతో 20సార్లు సమావేశమయ్యానని గుర్తు చేశారు.

### యువరాజు స్టార్టప్ నాన్ స్టార్టప్‌గా మిగిలింది

యువరాజు స్టార్టప్ నాన్ స్టార్టప్‌గా మిగిలిపోయిందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీని ఇప్పటికీ విజయవంతంగా లాంచ్ చేయలేకపోయారని చురక అంటించారు. యూపీఏ హయాంలో తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనను టార్గెట్ చేశారని ఆరోపించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు కేంద్రమంత్రులను కలవడానికి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. గుజరాత్ రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు కుట్రలు చేశారని ధ్వజమెత్తారు.

# డాక్టర్ గోళ్ళభూపతి రావు ను సన్మానించిన కళాభారతి సభ్యులు

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు ఫిబ్రవరి : 07 మరో ఉదయం**

పర్వవరణ ప్రేమికులు డాక్టర్ గోళ్ళ భూపతి రావు ను సన్మానించిన కళా భారతి సభ్యులు. బుధవారం భద్రాద్రి కళాభారతి భద్రాచలం వారి ఆధ్వర్యంలో ప్రుభుత్వ జూనియర్ కాలేజి అవరణ నందు నిర్వహిస్తున్న 22 వ కళా భారతి నాటకోత్సవ సంబరాలలో ప్రముఖ పర్వా వరణ ప్రేమిఖులు డాక్టర్ గోళ్ళభూపతి రావు ను వీరు గ్రీన్ భద్రాద్రి లో చేస్తున్న సేవలు, సాధించిన అవార్డ్స్ కు వీరిని అభినందించి డాక్టర్. గోళ్ళభూపతి రావు మంజుల రాని దంపతులను కళాభారతి గౌరవ అధ్యక్షులు తాళ్లూరి పంచాక్షరయ్య, అద్యక్షులు పాకాల దుర్గ ప్రసాద్ ఉపాధ్యాక్షులు టి.సిద్ధులు దుస్సాలవుతో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో డాక్టర్. లక్ష్మి నారాయణ, వంశీ, రా ము, రమణరావు, శ్రీనివాస్, వెంకట రెడ్డి, అజీం, నాగేశ్వర రావు, నారసింహారావు, రమేష్ రామరాజు తదితరులు పాల్గోన్నారు.



# బాలానగర్ నూతన సీఐకి ఘన సన్మానం...

**కూకట్పల్లి మరో ఉదయం న్యూస్:**

సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ నవీన్ కుమార్ ను, తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు అధిముల రాము, ముఖ్య సలహాదారు నల్ల విల్సన్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సభ్యులు సీఐను శాల్వతో ఘనంగా సన్మానించారు అనంతరం సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం 24గం లు అందుబాటులోనే ఉంటాను. ఏదైనా సమస్య వస్తే, అవసరమైతే అర్ధరాత్రి కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య సలహాదరు నల్ల విల్సన్ మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు పటిష్ఠమైన రక్షణ కల్పించేందుకు కృషి చేయాలని, శాంతి భద్రతల విషయంలో ఏలాంటి నిర్లక్ష్యం వహించోద్దని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీడిమెట్ల రమేష్, కోశాధికారి దాండు రవి కుమార్, కార్యనిర్వహక అధ్యక్షురాలు దీప్తి, గౌరవ అధ్యక్షుడు సుంకే రామన్, మీడియా కార్యదర్శి రవి స్టీవెన్సన్, మాజీకార్యదర్శి మోతె బాలరాజు, లక్ష్మినారాయణ, కుమార్, చింత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ నూతన సీఐకి ఘన సన్మానం...

కూకట్పల్లి మరో ఉదయం న్యూస్:

సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ నవీన్ కుమార్ ను, తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు అధిముల రాము, ముఖ్య సలహాదారు నల్ల విల్సన్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సభ్యులు సీఐను శాల్వతో ఘనంగా సన్మానించారు అనంతరం సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం 24గం లు అందుబాటులోనే ఉంటాను. ఏదైనా సమస్య వస్తే, అవసరమైతే అర్ధరాత్రి కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య సలహాదరు నల్ల విల్సన్ మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు పటిష్ఠమైన రక్షణ కల్పించేందుకు కృషి చేయాలని, శాంతి భద్రతల విషయంలో ఏలాంటి నిర్లక్ష్యం వహించోద్దని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీడిమెట్ల రమేష్, కోశాధికారి దాండు రవి కుమార్, కార్యనిర్వహక అధ్యక్షురాలు దీప్తి, గౌరవ అధ్యక్షుడు సుంకే రామన్, మీడియా కార్యదర్శి రవి స్టీవెన్సన్, మాజీకార్యదర్శి మోతె బాలరాజు, లక్ష్మినారాయణ, కుమార్, చింత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మాత రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన - సామజిక కార్యకర్త, పీవీ సేవా సమితి అధ్యక్షులు పిడిశెట్టి రాజు

**సిద్దిపేట జిల్లా : ఫిబ్రవరి : 07 మరో ఉదయం (హుస్నాబాద్ నియోజకవర్గం / కోహెడ మండలం )**

మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి అంబేద్కర్ 126వ, జయంతి వేడుకలు ప్రముఖ సామజిక కార్యకర్త, భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవా సమితి అధ్యక్షులు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రయివేట్ హాస్పిటల్ లోని రోగులకు పండ్లు, బ్రేడ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగాల తల్లి మాతా రామా భాయికోట్లాది ప్రజల హక్కులు కోసం అంబెద్కర్ చేసిన పోరాటాలకి ఏ మాత్రం ఆటంకం కలిగించ కుండా పిడకలు అమ్మి కుటుంబాన్ని పోషించి,అన్ని విధాలా అంబెద్కర్ కి అండగా ఉండి ఎంతో కఠినమైన పేదరికాన్ని అనుభవించి తన బిడ్డల అనారోగ్యానికి మందులు కొనటానికి డబ్బులు లేక వైద్యం ఇప్పించలేక తన ముగ్గురు కొడుకులను కన్నా ఒక్క కుమార్తెను కోల్పయి తను కూడా అనారోగ్యంతో వైద్యానికి డబ్బులు లేక చనిపోతూచావులు నాకు కొత్త కాదు ఇప్పటికే ముగ్గురు కొడుకులను ఒక కుమార్తెను కోల్పోయాను. నా ఆరోగ్యం కూడా క్షీణించింది కనీసం మిగిలిన ఒక్క కుమారుడనైన మంచిగా చూడు అని తన భర్త అంబెద్కర్ కి లేఖ వ్రాసి ప్రాణాలు విడిచిన త్యాగాల తల్లి మాత బాయీ అని అన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సుతారీ కనుకయ్య, కాంటాస్టేడ్ ఎమ్మెల్యే మరాఠీ మణిదీప్, కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షులు పద్మారెడ్డి, గంగాధర్ రమేష్, తిరుపతి, బుమయ్య, సంపత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోండి : పోతురాజు రవి - ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు పిర్యాదు.

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు ఫిబ్రవరి : 07 మరో ఉదయం**

కొత్తగూడెంలో నిబంధనలు విరుద్ధంగా 24 గంటలు మద్యం సరఫరా చేస్తు పచ్చని సంసారాలను చిత్తుచేయడమే కాక ఉజ్వల భవిష్యత్ ఉన్న యువతను మత్తులో ఉండేలా చేస్తున్న బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ పోతురాజు రవి లిఖితపూర్వక పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నిబంధనలను గాలికి వదిలేసి మద్యం సిండికేట్ అండదండలతో గల్లీకో బెల్ట్ షాప్ పెట్టి అధిక లాభాలపై ఆశతో మద్యం వ్యాపారం నిర్వహిస్తు స్థానిక ప్రజలను ఇబ్బంది పెడుతు యువతను మత్తులో ముంచుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక రాజకీయ నాయకుల పేర్లు చెప్పి ఎక్సైజ్ అధికారుల అండదండలు కూడ ఉన్నాయంటూ వైన్ షాప్ నిర్వాహకులు సిండికేట్ గా ఏర్పడి చిన్న చిన్న కిరాణా షాపుల వాళ్ళను , నిరుద్యోగ యువకులను బెల్ట్ షాపులు పెట్టేలా ప్రోత్సహించి అధిక ధరలకు మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. 20 వేలు ఉంటే చాలు బెల్ట్ షాప్ పెట్టుకోండి నెలకు ఉన్న చోట కదలకుండా ప్రతి నెల 10 లాభం అంటు ఆశ పెడుతు గల్లీ గల్లీలో బెల్ట్ షాపులు పెట్టించి నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఎనీ టైమ్ మద్యం లభించడంతో కుటుంబ కలహాలతో పాటు, యువకుల మధ్య తరచుగా గొడవలు కూడ జరుగుతున్నాయన్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుని వైన్ షాపుల్లో అన్ని బ్రాండ్ ల మద్యం అమ్మకాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ టౌన్ జనరల్ సెక్రటరీ ఆనంద్ అగర్వాల్, సునీల్, సందీప్, అలీ భాయ్, షారుక్, రాకేష్, నవీన్, అఖిల్, శివ తదితరులు ఉన్నారు.



# పాలమూరు న్యాయ యాత్రను విజయవంతం చేయాలి

## : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 7 :**

సిడబ్ల్యుసి మెంబెర్ మహబూబ్ నగర్ పార్లమెంట్ ఇంచార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి చెప్పటబోయే పాలమూరు న్యాయ యాత్ర కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. రాహుల్ గాంధీ గారు చేపడుతున్న యాత్రకు స్ఫూర్తిగా చేపట్టబోయే ఈ యాత్రకు ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని ఉమ్మడి కొత్తూరు మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఈనెల 11వ తేదీ ఆదివారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రారంభమై మూడు రోజులపాటు అన్ని మండలాలలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి ,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణా జలాలపై కేసీఆర్ ఉద్యమం చేస్తామనడం హాస్యాస్పదం : మంత్రి జూపల్లి కృష్ణారావు

## తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఫ్యామిలీ అన్ని విధాలుగా దోచుకుంది : చల్లా వంశీచంద్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 7**

నీళ్లు, నిధులు, నియామకాలు ట్యాగ్ లైన్‌తో ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ నట్టేట ముంచాడని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాలపై ఉద్యమం చేస్తామని కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారంటూ ప్రశ్నించారు. కృష్ణా బేసిన్‌లో 811 టీఎంసీలు ఉన్నా, తెలంగాణకు వాట దక్కలేదని తెలిపారు. కానీ, పార్లమెంట్‌లో ఓట్లు పొందేందుకు కేసీఆర్ నాటకాలు మొదలుపెట్టాడని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కేసీఆర్ కనీసం అపెక్స్ కమిటీ మీటింగ్‌కు వెళ్లలేదని అన్నారు.ఏపీ ప్రభుత్వంతో కేసీఆర్ కుమ్మక్కై, మన వాటానూ ఏపీకి తరలించాడని ఆరోపించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో తెలంగాణలో 68 శాతం ఉండగా, ఏపీలో 32 శాతం ఉందని అన్నారు. కానీ, తెలంగాణకు సరైన వాట అందలేదని గుర్తు చేశారు. దీంతో కేఆర్ఎంబీని ఏర్పాటు చేయాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. నీటి హక్కుల కోసం కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో కొట్లాడలేదని అన్నారు. ముడుపుల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చును రూ.లక్ష కోట్లకుపైగా పెంచారని గుర్తు చేశారు. ఉద్యమం చేయాల్సినప్పుడు చేయకుండా, ఇప్పుడు ఉద్యమం అంటే ప్రజలు నవ్వుతారని ఎద్దేవా చేశారు. పునర్విభజన చట్టం సరిగ్గా లేదని కేంద్రంతో కొట్లాడలేదని ఆరోపించారు.సీడబ్ల్యూసీ ఇన్వైటీ చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఫ్యామిలీ అన్ని విధాలుగా దోచుకుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరిపాలన నడుస్తుంటే ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.





కాళేశ్వరం ప్రాజెక్టులో దోపిడీని బయట పెడతామని అన్నారు. నిబంధనలు ప్రకారం 550 టీఎంసీలు రావాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు కేసీఆర్ ప్రశ్నించ లేదని అన్నారు. కనీసం కేటాయించిన 299 టీఎంసీలను కూడా కేసీఆర్ వాడలేదని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు కేవలం 212 టీఎంసీలు మాత్రమే వినియోగించుకున్నానరని తెలిపారు. నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులు చేపట్టాలని మంత్రికి వినతి పత్రం అందచేసిన భీమ్ భరత్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 7 :మరో ఉదయం**

హిమాయత్ నగర్ నుండి తంగడపల్లి (వయా ముడిమ్యల్, రావులపల్లి, మేడిపల్లి), హిమాయత్ నగర్, తంగడపల్లి నుండి ఎల్వర్తి వరకు (వయా ప్రొద్దటురు, టంగుటూరు) రోడ్ల మరమ్మతులు చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి పామెన భీమ్ భరత్ అధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, పిఎసి చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, నక్క బుచి రెడ్డి, చేవెళ్ల యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి, అతెల్లి రవీందర్ రెడ్డి తదితరులు రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బుధవారం సెక్రటేరియట్ లోని ఆయన చాంబర్లో కలిసి వినతి పత్రం అందజేశారు.



# మంత్రిని కలిసిన ఆలయ పాలకమండలి

**అల్లంపూర్ మరో ఉదయం న్యూస్:**

ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శ్రీ జోగులాంబ దేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రోజు బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఆలయ పాలకమండలి చైర్మన్ చిన్న కృష్ణయ్య ఆలయ అధికారి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిశారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠంగా వీరాజిల్లుతున్న అమ్మవారి ఉత్సవాలకు రావాలని పాలకమండలి సభ్యులు అధికారులు హైదరాబాద్లోని ఆమె నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అంతకంటే ముందు ఆలయ ప్రధాన అర్చకుడు దిండిగల్ ఆనంద్ శర్మ పాలకమండలి సభ్యులతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను ముందుగా సెలవుతో సన్మానం చేసి ఆలయ మర్యాదలతో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా హాజరవుతానని పాలకమండలి సభ్యులు అధికారులకు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ చిన్న కృష్ణయ్య పాలకమండలి సభ్యులు వెంకటనారాయణ రెడ్డి ఆలయ ప్రధాన అర్చకుడు దిండిగలానా శర్మ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కరించాలని వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 7 :మరో ఉదయం**

సరూర్ నగర్ డివిజన్ సమగ్రా భివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని ఎల్బీనగర్ ఈస్టజోన్ కమిషనర్ పంకజను కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. మంగళవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జోనల్ కమిషనర్ కు పలు సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ నగర్, భగత్ సింగ్ నగర్, విజయపురికాలనీ, లక్ష్మీ నగర్, ఎస్బీఐకాలనీల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.




# పర్యాటక కేంద్రంగా మేడారం అభివృద్ధి

## నిధుల కోసం ప్రభుత్వంలో చర్చిస్తాం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి: సీతక్క

**ములుగు,ఫిబ్రవరి7(మరో ఉదయం)**

మేడారం జాతర అభివృద్ధికి నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి సీతక్క అన్నారు. మేడారం జాతర ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాల కల్పనపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ అధికారులను పురమాయిస్తున్నారు. జాతర పరిసరాల్లో ఉన్న రోడ్లను డబుల్ విస్తరించి భక్తులు ఎక్కడ కూడా ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. జాతర పరిసరాలను మరింత విస్తరింపజేసేందుకు అవసరమైన భూసేకరణ కూడా చేపట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు. మేడారాన్ని కుంభమేళా తరహాలో తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. జాతరలో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మేడారం జాతర వరకు ఉన్న దారులను పూర్తిగా విస్తరింపజేస్తే భక్తులకు ట్రాఫిక్ సమస్య తలె త్తకుండా ఉంటుందన్నారు. ఈసారి జాతరలో భక్తులకు తాగునీటి వసతి, టాయిలెట్స్‌ను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేశామన్నారు. మేడారంలో కాలుష్యం తలెత్త కుండా పారిశుద్ధ్యం పనులు కూడా ఎప్పటికప్పుడు చేపట్టామని అన్నారు. రాబోయే రోజుల్లో జాతరను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. మేడారాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం శాశ్వత పనులు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు. జాతరన నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించామని మంత్రి సీతక్క తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. జాతరలో మరిన్ని శాశ్వత ఏర్పాట్లు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



# మేడారంలో జనజాతర సందడి

## కన్నెపల్లిలో గుడిమెలిగే పండగ ప్రారంభం

## గిరి జాతరకు భారీగా తరలిరానున్న భక్తజనం

**ములుగు,ఫిబ్రవరి7(మరో ఉదయం):**

ములుగు జిల్లా మేడారంలోని కన్నెపల్లిలో గుడిమెలిగే పండుగ ప్రారంభమైంది. మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ ఆలయాల్లో పూజారుల ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారం మహాజాతర ప్రారంభానికి నాందిగా గుడిమెలిగే పండుగ చేస్తామని పూజారులు తెలిపారు. గుడిమెలిగే పండుగలో భాగంగా సమ్మక్క, సారలమ్మ ఆలయాల పైకప్పులను గడ్డితో పూజారులు కప్పారు. సమ్మక సారలమ్మ జాతర ఉండడంతో భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. భక్త జనసందోహంతో మేడారం సందడిగా మారనుంది. పెద్ద ఎత్తున్న బంగారాన్ని సమ్మక సారలమ్మకు భక్తులు సమర్పిస్తుంటారు. ప్రభుత్వం కూడా సదుపాయాలు కల్పించి, భక్తులకు ఇబ్బదులు రాకుండా చేస్తోంది. రెండేళ్ల కోమారు జరగే సమ్మక్క, సారలమ్మ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవంగా ఘనతను చాటుకోనుంది. ఉత్తరాదిలో జరిగే కుంభమేళాకు తీసిపోని విధంగా ప్రజలు ఈ జాతరను ఆరాధిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తజనులు పోటెత్తుతున్న తీరు చూస్తుంటే మేడారంనకు ఉన్న ప్రత్యేకత వేరుగా చెప్పనక్కరలేదు. రెండేళ్లకు ఒకసారి వచ్చే జాతర కావడంతో పాటు తెలంగాణ గిరిజన జాతర కావడంతో ప్రపంచ గుర్తింపు దక్కింది..మేడారం ఉత్సవానికి జాతీయ హోదా రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటు న్నారు. అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటి నుంచే కృషి చేయాల్సి ఉంది. ప్రజల్లో ఎంతో భక్తి విశ్వాసం ఉంటే తప్ప ఈ జాతరకు ఇంతటి ఆదరణ దక్కదు. లక్షలాదిగా ప్రజలు నాలుగు రోజులుగా తరలివచ్చి గద్దెలను దర్శించుకుని అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తారు. అన్నింటికి మించి ప్రభుత్వం ఇక్కడ చేసిన ఏర్పాట్లు అమోఘం. ముఖ్యంగా మంత్రులు సీతక్క, కొండా సురేఖలు అన్నీ తామై అధికారులను నడిపిస్తున్నారు. ఏటా లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం అమ్మవార్లను దర్శించుకుం టున్నారు. మొక్కులు, పూజలతో మేడారం ఆధ్యాత్మిక వనంగా మారుతోంది. ఇక్కడి రావడం ఎంతో అదృష్టమని అత్యధికులు ఆనందపారవశ్యం చెందుతారు. ఆ అనుభూతి మాటల్లో చెప్పలేమంటున్నారు. చిన్నపాటి కుగ్రామంలో లక్షలాది మందికి అధికారులు సకల ఏర్పాట్లు చేయడమంటే ఒక సవాలే. అయినా దానిని సక్రమంగా చేపట్టిన తీరు అభినందించకుండా ఉండలేం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక సౌకర్యాలు అనుకున్న స్థాయిలో లేకున్నా ఎక్కడా ఇబ్బందులు రాకుండా అధికారులు తమ ప్రతిభను, చిత్తశుద్ధిని రెండేళ్లకోమారు చాటుకుంటున్నారు. అధికారులు కూడా అంకితభావంతో పని చేస్తారు. సమైక్య రాష్ట్రంలో సమ్మక్క సారక్క జాతరకు దక్కాల్సిన ప్రాముఖ్యం దక్కకుండా పోయింది. తెలంగాణ ఆత్మగౌరవానికి నిజమైన ఘన వారసత్వాన్ని అందించిన మహాతల్లుల జాతర ఏర్పాట్లకోసం ఈసారి దాదాపు 15కోట్లను కేటాయించారు. మేడారం సమ్మక్క–సారక్కలు ఆత్మగౌరవానికి, ధిక్కార సంస్కృతికి ప్రతీకలని చెప్పుకుంటారు. గిరిజనులు తమ ఆరాధ్యదైవాలను కొలిచే జాతర. నియంతృత్వ ధిక్కారానికి, పోరాట పటిమకు నిలువెత్తు ప్రతిరూపం. ఈ మహాజాతర ఘనంగా నిర్వహించాలన్న సంకల్పాన్ని ప్రభుత్వం ప్రకటించింది. మేడారం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రులు ప్రకటించారు. ఈ మహాజాతర భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రపంచమే అబ్బుపడేరీతిలో ఏర్పాట్లు చేస్తాం అని మంత్రి సీతక్క చెప్పారు. ఇకపోతే జంపన్న వాగులో నీరు లేకపోవడం వల్ల లక్నవరం చెరువు నుంచి నీటిని విడుదల చేయాల్సి వస్తోంది. భక్తులు అత్యంత పవిత్రంగా జంపన్నవాగులో స్నానమాచరిస్తారు. ఆ వాగు కలుషితం కాకుండా చూడాల్సి ఉంది. భక్తులు జాతర జరిగే సమయం లోనే కాదు.. ఇక్కడికి వచ్చి నిరంతరాయంగా వచ్చి తల్లుల దీవెనలు పొందుతున్నారు. గద్దెలను దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఎక్కడాలేనివిధంగా గిరిజన సమాజమే కాదు మిగితా సమాజం తండోప తండాలుగా వచ్చి వెళ్తుంటారు. అందుకు అనుగుణమైన ఏర్పాట్లు చేస్తే భక్తులకు ఇబ్బందులు రావు. మేడారంలో నాలుగురోజులు జరిగే సమ్మక్క సారక్క మహాజాతర బుధవారం ప్రారంభమైంది. మేడారంలో గద్దెలపై కొలువుదీరిన వనదేవతలను దర్శించు కోవడానికి లక్షలాదిమంది తరలివస్తారు. భక్తితో మొక్కులు చెల్లించుకుంటారు. తల్లులిద్దరూ గద్దెలపై కొలువుదీరే నాటికి దర్శనానికి భక్తులు పోటెత్తుతారు. తెలంగాణ నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి లక్షలాదిగా తరలివస్తారు. ఆ సమయంలో క్యూలైన్లు, గద్దెల ప్రాంగణం కిక్కిరిసి పోతుంది. జంపన్నవాగు పుణ్యస్నానాలతో పులకించిపోతుంది. వనదేవతలకు ఎత్తుబంగారం, ఒడిబియ్యంతో మొక్కులు సమర్పించి తల్లీ సల్లంగ సూడు.. రెండేళ్లకోసారి వస్తాం అంటూ తిరుగు ప్రయాణం అవుతారు.

# మయన్మార్‌లో క్షీణిస్తున్న శాంతిభద్రతలు

## రఖైన్ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు

## అటువైపు వెళ్లొద్దని భారతీయులకు ప్రభుత్వం హెచ్చరిక

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(మరో ఉదయం):**

మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రంలో భద్రతా పరిస్థితులు క్షీణిస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం కీలక అడ్వైజరీ జారీ చేసింది. హింసాకాండ పెరిగిపోతుండడంతో భారతీయ పౌరులు ఎవరూ ఆ రాష్ట్రానికి వెళ్లొద్దని సూచించింది. హింసాత్మక పరిస్థితులతోపాటు టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లో అంతరాయం, నిత్యావసర వస్తువుల కొరత వంటి దారుణ పరిస్థితులు నెలకొన్నాయని వివరించింది. ఇలాంటి పరిస్థితుల కారణంగా అక్కడికి వెళ్లొద్దని, ఇప్పటికే అక్కడ ఎవరైనా ఉంటే తక్షణమే ఆ రాష్ట్రం నుంచి వెళ్లిపోవాలని భారతీయులను కోరింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక అడ్వైజరీని విడుదల చేసింది. కాగా మయన్మార్‌లో ఫిబ్రవరి 1, 2021న సైనిక ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజాస్వామ్యం పునరుద్ధరణకు డిమాండ్ చేస్తూ తీవ్రస్థాయిలో హింసాత్మక నిరసనలు జరుగుతు న్నాయి. రఖైన్ రాష్ట్రంతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో గతేడాది అక్టోబర్ నుంచి సాయుధ జాతి సమూహాలు, మయన్మార్ మిలిటరీ మధ్య తీవ్రమైన ఘర్షణలు జరుగుతున్నాయి. ఫలితంగా అక్కడ హింసాకాండ నెలకొంది. ఈ హింస గతేడాది నవంబర్ నాటికి కీలకమైన మయన్మార్ పట్టణాలతో పాటు భారతదేశ సరిహద్దు సమీప ప్రాంతాలకు విస్తరించాయి. మయన్మార్ సైన్యం తన ప్రత్యర్థులు, సైనిక పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేస్తోంది. ఈ పరిణామం మణిపూర్, మిజోరాం రాష్ట్రాల్లో శాంతిభద్రతకు ముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయి. అందుకే ఈ పరిణామాలపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. కాగా భారత్‌కు మయన్మార్ వ్యూహాత్మక పొరుగు దేశాలలో ఒకటిగా ఉంది. మిలిటెన్సీ ప్రభావిత రాష్ట్రాలైన్ర నాగాలాండ్, మణిపూర్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలతో మయన్మార్ 1,640 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటోంది. అందువల్ల అక్కడ ఇప్రభావం మన ప్రాంతంపై పడకుండా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుంది.

# సినిమా వార్తలు




## సిద్దు జొన్నలగడ్డ బొమ్మరిల్లు భాస్కర్ కాంబినేషన్

### జాక్ టైటిన్‌ను ఖరారు చేస్తూ ప్రకటన

స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ హీరోగా, స్క్రీన్ రైటర్‌గా, కో ఎడిటర్‌గా, క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా పలు విభాగాల్లో తన సత్తాను చాటుకుంటూ.. తన మల్టీటాలెంట్‌ను ప్రదర్శిస్తున్నారు. డీజే టిల్లు సినిమాతో తిరుగులేని బ్లాక్ బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఎంతో సెలెక్టివ్‌గా సినిమా కథలను ఎంచుకుంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన 'టిల్లు స్క్వేర్' సినిమాతో పాటు బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న.. ఈ చిత్రానికి టైటిల్ ఖరారు చేస్తూ.. తాజాగా మేకర్స్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'జాక్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లుగా తెలుపుతూ.. సిద్దు జొన్నలగడ్డ పుట్టినరోజు స్పెషల్‌గా టైటిల్ లుక్ పోస్టర్‌తో పాటు.. మేకర్స్ విడుదల చేసిన మోషన్ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్‌లైన్. ఈ పోస్టర్‌లో రెండు గన్స్ పట్టుకుని.. ఒక డాన్‌లా సిద్దు జొన్నలగడ్డ కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ 'జాక్' టైటిల్ సోషల్ మీడియాలో టాప్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నుండి త్వరలోనే అప్‌డేట్స్ ఉంటాయని మేకర్స్ ఈ సందర్భంగా తెలియజేశారు. చాలా గ్యాప్ తర్వాత 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' వంటి సినిమాతో బొమ్మరిల్లు భాస్కర్ రీ ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా ఆయనకు మంచి గుర్తింపునే ఇచ్చింది. అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోలను డైరెక్ట్ చేసిన బొమ్మరిల్లు భాస్కర్‌తో.. యూత్ సెన్సేషన్ సిద్దు సినిమా చేస్తున్నాడనే ప్రకటన వచ్చినప్పుడే ఈ సినిమాపై భారీగా క్రేజ్ ఏర్పడింది. పూర్తిగా వినోదాత్మకంగా రూపుదిద్దుకుంటోన్న ఈ సినిమా.. కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తామని ఆయన అన్నారు.

## పెళ్లి వేడుకకు సిఎం రేవంత్‌ను ఆహ్వానించిన దిల్‌రాజ్

తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు తన కుటుంబంతో ఈరోజు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు. దిల్ రాజు, అతని సోదరుడు శిరీష్, కుమార్తె, అల్లుడు, దిల్ రాజు సోదరుని కుమారుడు ఆశిష్ ఈరోజు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో వున్నారు. అయితే ఇదేదో దిల్ రాజు పరిశ్రమ తరపున వెళ్లి కలిసింది కాదు, అతను వ్యక్తిగతంగా తన ఇంట్లో పెళ్లి వేడుకలకు ఆహ్వానించడానికి కలిశారు.

దిల్ రాజు సోదరుని కుమారుడు ఆశిష్ వివాహం త్వరలో జరగబోతోంది, అందుకే ఇటు పరిశ్రమలోని, అటు రాజకీయ, వ్యాపార రంగంలో వున్నవారిని దిల్ రాజు కుటుంబంతో సహా వెళ్లి వ్యక్తిగతంగా అందరికీ శుభలేఖలు ఇచ్చి పెళ్ళికి ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు ముఖ్యమంత్రిని కలిసి ఆశిష్ వివాహానికి ఆహ్వానించారని తెలిసింది. కొన్ని రోజుల క్రిత్రం తెలంగాణా మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ని కూడా కలిసి శుభలేఖ అందచేశారు. అంతకు ముందు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ని కూడా కలిసి అహ్వాన పత్రిక అందచేశారు. ఇక పరిశ్రమలో ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, నాగార్జున, వెంకటేష్ ఇలా అందరినీ వ్యక్తిగతంగా వెళ్లి కలిసి పెళ్ళికి పిలిచారు.



## ఓ స్టార్ ప్రొడ్యూసర్ మోసం చేశాడు

### లబోదిబోమన్న హీరోయిన్ మాల్వీ మల్హోత్రా



సినిమా ఇండస్ట్రీలో రాణించడం అంతా సులభం కాదు.. చాలా మంది ఎన్నో కష్టాలు ఎదుర్కొని సినిమాల్లో రాణిస్తూ ఉంటారు. కొంతమంది సినిమాలోకి రావడానికి ఇబ్బంది పడితే మరికొంతమంది సినిమాల్లోకి వచ్చిన తర్వాత కొన్ని తమ చుట్టూ జరుగుతున్న సంఘటనలు ఇబ్బంది పడుతుంటారు. తాజాగా తాను కూడా.. ఓ స్టార్ ప్రొడ్యూసర్ కారణంగా ఇబ్బంది పడ్డానని.. ఇంకో మాటలో చెప్పాలంటే మోసపోయానని అంటోంది హీరోయిన్ మాల్వీ మల్హోత్రా.. మాల్వీ మల్హోత్రా! బుల్లితెర నుంచి సినిమాల్లోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ? తనకొచ్చిన సినిమాలు చేసుకుంటూ పోతోంది. యంగ్ హీరో రాజ్ తరుణ్ సరసన తిరగబడరా సామీ తెలుగు మూవీలోనూ నటిస్తోంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాల్లోనే ఓ బాలీవుడ్‌లో తనకు ఎదురైన ఓ చేదు సంఘటన గురించి చెప్పి..లబోదిబో మంది.



## ఈగిల్మేకింగ్ వీడియో అదుర్స్

హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరించేందుకు రెడీగా ఉంటాడు టాలీవుడ్ మాస్ హీరో మాస్ మాహరాజా. ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్.. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఎంటర్టైన్ కూడా చేస్తుంటారు. ఇక గతేడాది వరుసగా హిట్స్ అందుకున్న రవితేజా.. తాజాగా ఈగిల్ సినిమాతో మన ముందుకు వస్తున్నారు. డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈమూవీ నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ మూవీపై మరింత హైప్ పెంచేశాయి. ఫిబ్రవరి 9న ఈ మూవీ అడియన్స్ ముందుకు రానున్న క్రమంలో.. ఈగిల్ మూవీ నుంచి మేకింగ్ వీడియో రిలీజ్ అయింది. ఆ వీడియో ఇప్పుడు అంతటా హాట్ టాపిక్ అవుతోంది. ఈగిల్ నుంచి రీసెంట్గా రిలీజ్ అయిన మేకింగ్ వీడియో.. సినిమా పై విపరీతంగా అంచనాలను పెంచేదిగా ఉంది. ఇంకా చెప్పాలంటే.. టీజర్, ట్రైలర్ ను మించిపోయి మరింత క్యూరియాసిటిని కలిగిస్తోంది. బ్యాగ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ అదిరిపోయాయి. దీంతో ఈ వీడియో ప్రస్తుతం యూట్యూబ్ లో ట్రెండ్ అవుతోంది.

## అంబాజీపేట మ్యారేజ్ బాండ్ విజయం

### సక్సెస్ హీరోగా సుహాస్

గత వారం విడుదలైన 'అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్' సినిమా మంచి టాక్ ని సొంతం చేసుకోవడమే కాకుండా, బాక్స్ ఆఫీస్ దగ్గర కూడా వసూళ్లు బాగానే రాబట్టింది. దర్శకుడు దుష్యంత్ ఈ సినిమా కథ ఒక యదార్ధ సంఘటన ఆధారంగా రాసుకున్నది. ఇందులో నటించిన శరణ్య ప్రభాకర్, సుహాస్ లకు మంచి పేరు తీసుకురావటమే కాకుండా, సుహాస్ కి కథానాయకుడిగా ఈ సినిమా వరసగా మూడో విజయాన్ని

అందించింది. సుహాస్ ఇంతకు ముందు 'కలర్ ఫోటో' అనే సినిమాలో కథానాయకుడిగా నటించగా ఆ సినిమా ఓటిటి లో విడుదలైంది. అయితే ఆ సినిమా జాతీయ అవార్డు గెలుచుకుంది. ఆ తరువాత 'రైటర్ పద్మభూషణ్' లో కథానాయకుడిగా చేసిన సుహాస్ కి ఆ సినిమా అటు మంచి పేరుతో పాటు, డబ్బులు కూడా తెచ్చింది. అది రెండో విజయం. ఇప్పుడు మూడో సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చేసాడు, ఇది ఇప్పటికే బ్రేక్ ఈవెన్ అయింది, మంచి విజయం సాధించింది.సుహాస్ కథానాయకుడిగా వైవిధ్యమైన కథలు ఎంచుకుంటున్నాడు, ఎదో పాటలు, లేదా వాణిజ్యపరమైన విలువలు ఉండాలి అన్నట్టుగా కాకుండా, సినిమాకి కథ ముఖ్యం, అందుకని తన ప్రతిభ చూపించుకోవడానికే వుండే విధంగా కథలని ఎంచుకుంటున్నాడు. ఇప్పుడు విజయవంతమైన ఈ మూడు సినిమాలు కూడా ఒకదానితో ఒకటి పోలిక లేకుండా ఉండేవే. సుహాస్ చేతిలో ఇంకా అరడజను చిత్రాలు వున్నాయి, కొత్తవాళ్లు కథలు చెప్తున్నారు, వింటున్నాడు కూడా. చిన్న నిర్మాతలకి, కొత్త దర్శకులకి సుహాస్ వున్నాడు అన్న భరోసా కల్పిస్తున్నాడు.

Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com